PRGI NO: TGTEL/26/A1984
ViSiON PRABHA
# విజన్ ప్రభ
తెలుగు దినపత్రిక
Published from . హైదరాబాద్..నల్గొండ. సూర్యపేట. రంగారెడ్డి. విజయవాడ. గుంటూరు.

TGTEL/26/A1984 VISION PRABHA
విజన్ ప్రభ
తెలుగు దినపత్రిక
విజన్ ప్రభ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను
• ప్రాంతీయ వార్తలపై పట్టు మరియు ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యత
• అనుభవం ఉన్నవారికి మెరుగైన అవకాశం
కావలసిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు:
98661 88619
96030 44841
*నియమనిబంధనలు వర్తిస్తాయి*

మంగళవారం మే 12, 2026 | ఎడిటర్. తూనం.వెంకటేశ్వర రావు. | సంపుటి:1 సంచిక:46 | పేజీలు 4 | వెల-2

## ఖజానా ఖాళీ ఆరోపణల వేళ..

## స్టాలిన్ ఇంటికి సీఎం విజయ్

చెన్నై: తమిళనాడు కొత్త సీఎం విజయ్ - మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. 2లో..

## భార్యను పశువులా చూడొద్దు:
## గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను భర్త పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది . గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. గతంలో పట్నా హైకోర్టు కూడా ఆ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. 2లో..

హైదరాబాద్: విద్యా ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలమని, ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను ఆయన

"విద్యావ్యవస్థలో తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. 1969 తెలంగాణ ఉద్యమానికి అదే కారణం. పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడం మా ప్రభుత్వ బాధ్యత."

"మేం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. 36 వేల మంది టీచర్ల బదిలీలను వివాదాలకు తావులేకుండా పూర్తి చేశాం."

»విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంపు
»ఫిన్‌లాండ్‌కు 25 మంది టీచర్ల పంపిణీ
»ప్రభుత్వ పాఠశాలల్లో పోషకాహారం, బ్రేక్‌ఫాస్ట్ పథకం

2లో

**ముఖ్యాంశాలు**

»ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు ప్రారంభం
»రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
»11 వేల టీచర్ పోస్టుల భర్తీ
»36 వేల మంది టీచర్ల బదిలీలు వివాదాలకు తావులేకుండా నిర్వహణ
»ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం
»విదేశాల్లో ఉత్తమ విద్యా విధానాల అధ్యయనం

## రామాయపట్నం పోర్టుకు రైలు మార్గాన్ని కలపండి:
## కేంద్రమంత్రికి ఎంపీ లావు విజ్ఞప్తి

2లో..

## ఆయుష్ వైద్య సేవలు.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం!

2లో..

## కొనసాగుతున్న అల్పపీడనం.. వారం రోజుల్లో ఏపీలో వర్షాలు

**నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది.**

విశాఖ: నైరుతి బంగాళాఖాతాన్ని ఆనుకొని శ్రీలంక పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. రాగల 48 గంటల్లో ఈ అల్పపీడనం మరింత బలపడే అవకాశాలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. అల్పపీడనానికి అనుబంధంగా 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని చెప్పారు. ఫలితంగా వారం రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం కోస్తా జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయని తెలిపారు. గడిచిన 24 గంటల్లో అల్లూరి జిల్లా పాడేరులో అత్యధికంగా 3.24 సెం.మీ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు: మంత్రి పొన్నం

హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని,

మిగతాది 2లో

## ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

2లో..

మరచిపోలేని అనుభూతిని పొందాం ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్

## మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

**ధాన్యం కొనుగోళ్లు,తరుగుదోపిడీపై నిరసనలు అధికారులు స్పందించడం లేదన్న మాజీమంత్రి వేముల**

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని, తరుగు దోపిడీని అరికట్టాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు, 2లో..

# సంపాదకీయం

## ఏ ఆకాంక్షలకీ రికార్డ్‌స్థాయి పోలింగ్‌లు!

భారత ప్రజాస్వామ్యం అంత సంక్లిష్టమైంది మరొకటి లేదు. అలాగే దాని విశిష్టతలకూ కొదవలేదు. అక్షరాస్యత, రాజకీయ చైతన్యం అంతంతమాత్రంగా ఉన్న భారత్ లాంటి దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కాదని 1950ల్లో ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రజలందరికీ ఒకేసారి సమానహక్కులను కల్పించటం దుస్సాహసమనే విమర్శలూ వెలువడ్డాయి. అప్పట్లో చాలా సహేతుకం అన్పించిన ఆ వ్యాఖ్యానాలూ, విమర్శలూ కాలపరీక్షకు నిలవలేకపోయాయి. అక్షరాస్యత అంతంత మాత్రమే అయినా ప్రజలు ఓట్లు వేయటానికి ఉత్సాహం చూపారు. మొదటి సార్వత్రక ఎన్నికల్లో 46శాతం మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆనాటికి దేశంలో అక్షరాస్యత 15శాతానికి కాస్త అటూఇటూగానే ఉంది. స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించిన చరిత్రతో కాంగ్రెస్ కీర్తి ఘనంగా వెలిగిపోతున్న నేపథ్యంలో కూడా ప్రజలు ఆనాడు రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. 489 స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌ను 364 చోట్లే గెలిపించారు. మిగతా స్థానాల్లో ప్రతిపక్ష పార్టీలకూ, స్వతంత్ర అభ్యర్థులకూ పట్టంకట్టారు. కాంగ్రెస్ పార్టీకి పడిన ఓట్లు 45 శాతం దాటలేదు. తొలి ఎన్నికల్లో 46శాతం మంది పాల్గొనటం కూడా అప్పట్లో ఒక రికార్డు. అమెరికా పౌరులు కూడా అంతటి రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించలేదు. 1948 నాటికే దాదాపు వందశాతం అక్షరాస్యతను అమెరికా సాధించింది. అయినా ఆ ఏడాది అక్కడ జరిగిన ఎన్నికల్లో 52శాతం మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. నిజానికి ఆనాటికి అక్కడ అన్నివర్గాల వారికీ ఓటువేసే హక్కుల్లేవు. రకరకాల కారణాలతో పలు రాష్ట్రాల్లో నల్లజాతీయులకూ, స్థానిక ఆదిమవాసులకూ, మహిళలకూ ఓటు హక్కును నిరాకరించారు. ఆ పరిమితులు ఉన్నా అక్కడి అక్షరాస్యతతో పోల్చితే ఓటింగ్ శాతం తక్కువేనని చెప్పాలి. ఏ రూపంలోనూ, ఏ వర్గానికీ ఓటుహక్కుని నిరాకరించని దేశంగా భారత్ 1950 నాటికి ప్రపంచంలోనే విశిష్టస్థానాన్ని సంపాదించింది.

వాగ్దానాలు చేసినట్లుగా జీవితాల్లో ప్రగాఢమార్పులను తీసుకురాలేని రాజకీయాలు ఉన్నచోట ప్రజల్లో కొంత నిరాసక్తత వ్యక్తంకావటం సహజం. కానీ ఆ నిరాసక్తతను కూడా ప్రదర్శించకుండా ప్రజలు ప్రతి ఎన్నికల్లో అధికంగా ఓటింగులో పాల్గొనటం మన దేశంలోనే బాగా జరుగుతోంది. ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాలే అందుకు నిదర్శనం. సగటు పోలింగ్ 89.85 శాతం నమోదైంది. 2007-- 2026 మధ్య రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పోలింగ్ గణనీయంగా పెరిగిన పరిస్థితే కనపడుతుంది. మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ లాంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రమే స్వల్ప తగ్గుదల కనపడింది. పెద్ద రాష్ట్రాల్లో పంజాబ్ మినహా ఎక్కడా ఈ పరిస్థితి లేదు. 2007లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో 76.04 శాతంగా నమోదైన పోలింగ్ 2022 నాటికి 72.15 శాతానికి తగ్గిపోయింది.

పోలింగ్ శాతాలనూ ఎన్నికల్లో పార్టీలు ప్రకటిస్తున్న వాగ్దానాలనూ చూస్తే ఒకటి స్పష్టంగా అర్థమవుతుంది. ప్రజల కోరికలూ ఆకాంక్షలూ పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా పార్టీల వాగ్దానాలు, నగదు బదిలీల హామీలు అధికమవుతున్నాయి. కులం, మతం అనేవి టిక్కెట్ల పంపిణీలో, ఓటర్లను సమీకరించటంలో ఇంకా గట్టి పాత్రను పోషిస్తున్నా అవే ఎన్నికల ఫలితాలను నిర్ణయించే ప్రబలశక్తులుగా లేవు. నగదు బదిలీలు, సబ్సిడీలు, ఇళ్ల నిర్మాణాలు, స్థలాల కేటాయింపు లాంటివి ఓటర్లకు ప్రధానంగా మారాయి. వాటిని అధికంగా వాగ్దానం చేసే పార్టీల వైపు మొగ్గటం ఒక ప్రధాన ధోరణిగా 1990ల తర్వాత బాగా ఎక్కువగా కనిపిస్తోంది. సినిమా గ్లామర్ లాంటివి జనంలోకి చొచ్చుకువెళ్లటానికి తోడ్పడుతున్నా, ప్రజలు కోరుకునే ఉచితాలనూ సంక్షేమపథకాలనూ పెద్దఎత్తున అమలుచేస్తామని హామీలు ఇవ్వకుండా ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు. తమిళనాడు ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకున్న సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కూడా పెద్దఎత్తున ఆ తరహా హామీలను ఇవ్వాల్సి వచ్చింది. వాటిని నిజాయితీగా అమలు జరిపితే ఏడాదికే అక్కడ రూ.90వేల కోట్లు అదనంగా ఖర్చుపెట్టాలి. జనాకర్షక పథకాలతో ఖజానాలు ఖాళీ అవుతున్నాయనీ అప్పుల ఊబిలోకి ప్రభుత్వాలను నెట్టివేస్తున్నాయనీ ఆర్థికవేత్తలూ వ్యాఖ్యాతలూ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా పార్టీలు వాటిని పట్టించుకునే స్థితిలో లేవు. అంతకంటే ముఖ్యంగా వాటిని తగ్గిస్తే ఉపేక్షించటానికి ప్రజలు సిద్ధంగా లేరు. తాత్కాలిక ఉచితాలతో వారెందుకు సరిపెట్టుకుంటున్నారు? దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించే పథకాలకు ఎందుకు ఆకర్షితులు కావటం లేదు? అని ప్రశ్నించుకుంటే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తున్న తీరునూ ప్రభుత్వాలు దాన్ని ప్రభావితం చేస్తున్న వైనాన్నీ లోతుగా పరిశీలిస్తే వీటికి కొంతైనా జవాబు దొరుకుతుంది. 1990ల తర్వాత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ సంస్థల పాత్ర గణనీయంగా తగ్గిపోయింది. ప్రైవేటురంగంలో వ్యాపారాలనూ పరిశ్రమలనూ ఆరంభించటానికి ప్రభుత్వ అనుమతులు రావటం చాలా సులభమైంది. వాటికి చౌకగా భూములను కేటాయించటం, రాయితీ ధరలకు కరెంటు సరఫరా చేయటం, పన్నుల్లో మినహాయింపులు ఇవ్వటం, రుణాల వెసులుబాటును బాగా పెంచటం పెద్ద ఎత్తున మొదలయ్యాయి. ఇదే తరహా ప్రోత్సాహకాలను విదేశీపెట్టుబడిదారులకు కూడా కల్పించటం ఆరంభించారు. వీటన్నిటి ఫలితంగా ఆర్థికవృద్ధిరేటు బాగా పుంజుకుంది. 1990లకు ముందు ప్రభుత్వపరమైన అనేక కట్టడులతో, నియంత్రణలతో ఆర్థిక వ్యవస్థ ఆశించినంత వేగంగా కదలలేకపోయింది. ఉత్పత్తుల్లో వైవిధ్యం లేకుండా పోయింది. అందుబాటులో ఉన్న వస్తువులూ పరిమితంగా ఉండేవి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టటం చాలా ఆలస్యమూ అయ్యేది. ప్రపంచమార్కెట్‌లో లభ్యమయ్యే వస్తువుల్లో చాలా వరకూ దేశంలో దొరికేవి కావు. ఆర్థిక సంస్కరణలతో ఈ పరిస్థితి మొత్తం మారిపోయింది. ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే వినియోగవస్తువులన్నీ ఇప్పుడు భారతదేశంలో అందుబాటులో

## పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక

మొదటిపేజీ తరువాయి

ఇన్వెస్టర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

## మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

మొదటిపేజీ తరువాయి

మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దొడ్డు రకం ధాన్యానికి గ్రేడ్ వన్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరన్న తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.వడ్ల కొనుగోళ్ల పక్రియ నత్తనడకన సాగుతున్నదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పంటను అమ్ముకోవడానికి రైతులు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మూడు రోజులుగా పలు కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి రైతు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించి కేంద్రాలు తెరిచే సరికి 15 రోజులు, గన్నీ బ్యాగులు వచ్చేసరికి వారం, కాంటా పెట్టేసరికి మరో వారం అన్నట్లుగా 20 రోజుల పాటు కావాలనే జాప్యం చేసిందని ఆరోపించారు. మద్దతు ధర రూ.2,390 ఉండగా ప్రభుత్వ జాప్యం భరించలేక రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులకు రూ.1,750 నుంచి రూ. 1900లకే అమ్ముకుంటున్నారని, దీంతో ఎకరాకు సుమారు రూ.15వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, తరుగు పేరుతో 40 కిలోలకు 5 కిలోల అదనపు వడ్లు (క్వింటాలుకు 12.5 కిలోలు) దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఇది కేవలం 1.5 కిలోలు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. ల్గ÷తుల సమస్యలపై మాట్లాడేందుకు కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదని, కనీసం స్పందించే తీరిక కూడా లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ పాలనీలో భాగమేనని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాకు లారీలను పెంచాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని, తరుగును తగ్గించి, పాత పద్ధతిలోనే వడ్లు సేకరించాలని, దొడ్డు రకానికి గ్రేడ్ -1 రేటుతో పాటు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి రైతులకు న్యాయం చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రధాని మా ఇంటికి రావడం గొప్ప విశేషం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తమ నివాసానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేస్తూ ప్రధాని పర్యటనను ప్రత్యేకమైన సందర్భంగా వారు అభివర్ణించారు. ప్రధాని మోదీకి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సీఎం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తమ కుటుంబం ఎప్పటికీ మర్చిపోలేని, ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే సాయంత్రం ఇదని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ రోజు తమ నివాసంలో ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం తమకు లభించిన గొప్ప గౌరవం, సంతోషమని చెప్పుకొచ్చారు. ఆప్యాయత, అనురాగంతో ప్రధాని తమతో గడిపిన ఈ సందర్భం తమ అందరికీ ఎంతో ప్రత్యేకమని వ్యాఖ్యానించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో మోదీ అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి, మద్దతుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు చెప్పారు. హైదరాబాద్‌లోని తమ ఇంటికి ప్రధాని మోదీని స్వాగతించడం గొప్ప విశేషమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. మోదీ తమ కుటుంబానికి అందించిన ఆప్యాయత, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబంలోని మూడు తరాలు ప్రధానితో కలిసి ఉండటం ముఖ్యంగా గుర్తుండి పోయే మధుర జ్ఞాపకమని చెప్పుకొచ్చారు. మోదీ.. తన కుమారుడు నారా దేవన్ష్‌ను ఆశీర్వదించడం నిజంగా గొప్ప అదృష్టమని తెలిపారు. ఎప్పటిలాగే, తాను దేశంపై ఆయన అచంచలమైన నిబద్ధతతో ప్రేరణ పొందానని అన్నారు. ప్రజల సేవలో మరింత కష్టపడి తాను పనిచేయడానికి మోదీ నుంచి స్ఫూర్తి పొందానని తెలిపారు. ఇలాంటి క్షణాలు జీవితాంతం ఎంతో గుర్తుండి పోతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి

## ఖజానా ఖాళీ ఆరోపణల వేళ..

మొదటిపేజీ తరువాయి

ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ (ఎఐయిఎ) ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన భాజపాను తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

చీలిక దిశగా అన్నాడీఎంకే?

సర్టిఫికేట్ మర్చిపోయి.. ప్రమాణస్వీకారం మిస్ అయిన మంత్రి కీర్తన..

టీవీకే విజయ్ నేతృత్వంలో ఆదివారం తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. మే 13న ఈ ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కోనుంది. మరోవైపు నేడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. నిన్న మంత్రిగా ప్రమాణం చేసిన యువనేత కీర్తన.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఎలక్షన్ సర్టిఫికేట్‌ను తీసుకురాకపోవడమే అందుకు కారణం. తర్వాత వెనక్కి వెళ్లిన ఆమె దానిని తీసుకొచ్చి, సమర్పించడంతో ఎట్టకేలకు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.

## భార్యను పశువులా చూడొద్దు: గృహహింస కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

నిందితుడు మద్యం మత్తులో దాడి చేశాడని బాధితురాలి తరపు న్యాయవాది కోర్టు (రాబజూతీవఎవ జశీబతీ)లో వాదనలు వినిపించారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైంది. ఆ తర్వాత కర్రతో కూడా దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. మరోవైపు నిందితుడు మూడు వివాహాలు చేసుకోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు మొదటి భార్య. వాదనలు విన్న న్యాయస్థానం.. "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు..? ఇలాగే వేధిస్తే.. ఆమె మిమ్మల్ని వదిలి వెళ్లిపోతుంది. రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అంటూ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

## రామాయపట్నం పోర్టుకు రైలు మార్గాన్ని కలపండి: కేంద్రమంత్రికి ఎంపీ లావు విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: పిడుగురాళ్ల జంక్షన్‌ను రామాయపట్నం పోర్టుకు లింక్ చేస్తూ.. కొత్త రైల్వే లైన్ తీసుకురావాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం కేంద్రమంత్రిని ఆయన కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఓడరేవుకు రైలు మార్గాన్ని కలపడం ద్వారా.. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన పెరుగుతుందని వివరించారు. సిమెంట్, సున్నపురాయి, వ్యవసాయం, లాజిస్టిక్స్ రంగాలకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో స్టాపులు ఇవ్వాలని కోరారు. పల్నాడు నుంచి వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులు ప్రస్తుతం ప్రధాన నగరాలకు వేగవంతమైన రైలు కనెక్టివిటీని పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు మధ్య విద్యార్థులు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, కుటుంబాల రాకపోకలు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని కేంద్రమంత్రిని ఎంపీ కోరారు. ప్రతిపాదిత ఈ సర్వీసు ప్రయాణ సమయాన్ని తగ్గించి, రెండు ప్రాంతాల మధ్య హై-స్పీడ్ రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుందన్నారు. తన ప్రతిపాదనలకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. అభ్యర్థనలను పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

## ఆయుష్ వైద్య సేవలు.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం!

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఆయుష్ వైద్య సేవల్లో నాణ్యత మరింత పెంచేందుకు, గుర్తింపు లేని వైద్యులకు కళ్లెం వేసేందుకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ ఆయుర్వేద, హోమియో, సిద్ధ, యూనాని, నేచురోపతి వైద్యానికి ప్రాచుర్యం తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2022కు సవరణ చేసే బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలిపారు. త్వరలో కొత్త విధివిధానాలు రాబోతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విధివిధానాల రూపకల్పన కోసం మూడు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. టెక్నికల్, ఎక్స్‌పర్ట్స్, స్టేక్ హోల్డర్స్ కమిటీలు వేశారు. ఒక్కో కమిటీలో ముగ్గురు అధికారులు, సీనియర్ వైద్యులు, నిపుణులు ఉంటారు. ఈ కమిటీలు ఆయుష్ వైద్య రంగ నిపుణులు, ప్రజల్ని భాగస్వామ్యం చేసి వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని ఈ నెలాఖరులోగా నివేదిక సమర్పించనున్నాయి. విధివిధానాల రూపకల్పన కోసం కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ అంశాలను కమిటీలు పరిశీలిస్తాయని ఆయుష్ విభాగం ఇన్‌ఛార్జి డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. కొత్తగా వచ్చే నిబంధనల ప్రకారం క్లినిక్‌లు, ఆసుపత్రులు ఆయుష్ శాఖ నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. విద్యార్హతలు కలిగిన వారి ద్వారా మాత్రమే ఆయుష్ వైద్య సేవలు ప్రజలకు అందుతాయి.

## ఆర్మూర్ సొసైటీకి తాళం

### ధాన్యంతరలించక పోవడంపై రైతుల నిరసన

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సొసైటీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో నెలరోజులుగా ధాన్యం కోసి కల్లాల్లో వేసి తూకం చేసిన కూడా లారీల కొరతతో ఎక్కడి ధాన్యం అక్కడే ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాంపూర్ గ్రామస్తులు ఆర్మూర్ సొసైటీకి సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. సొసైటీ నిర్వాహకులు లారీ యజమానులతో కుమ్మక్కై లారీలను తమ గ్రామానికి పంపడం

లేదని, మిగతా గ్రామాలకు ప్రతీరోజు ఒకటి, రెండు లారీలను పంపుతూ ధాన్యం సేకరిస్తున్నారని, తమ గ్రామం పై వివక్ష ఎందుకు చూపిస్తున్నారని సొసైటీ చైర్మన్ ని నిలదీశారు. ధాన్యం రోజుల తరబడి కల్లాల్లో ఉండడం వల్ల తరుగు రూపంలో క్వింటానికి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలను పంపి కొరతను తీరుస్తానని నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించి రెండు రోజులలో లారీలను తీసుకొని రాకుంటే ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామస్తులము అందరం కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలిగించాలని తీర్మానం

సూర్యాపేట జిల్లా మే 11 ( విజన్ ప్రభ )

:నడిగూడెం:: మండల పరిధిలోని రామాపురంలో డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని గ్రామ పాలకవర్గం నిర్ణయించింది. సోమవారం సర్పంచ్ వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నర్సింహారావు వెల్లడించారు. మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించే నిర్మాణాలను తక్షణమే తొలగిస్తామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో ఉప సర్పంచ్ నాగార్జున, వార్డు మెంబెర్స్ శ్రీను, వీరభద్రం వంశీ, గోపి, దీపిక, లింగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి మండల టాపర్ కు రవీంద్రభారతిలో ప్రతిభా అవార్డు

సూర్యాపేట జిల్లా మే 11 ( విజన్ ప్రభ )

నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొమ్మిడి మైథిలి ఇటీవల పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు.ఈ సందర్భంగా సోమవారం రవీంద్రభారతిలో బి సి టి ఎ తెలంగాణ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. అలాగే పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డర్రా ఉపేందర్ ను శాలువతో సత్కరించారు ఈ.కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య,ఎంపీ మల్లు రవి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరికి అందిన కాడికి వాళ్లే దోపిడి

## ఇసుక మాఫియా అరాచకం

### చనుపల్లిలో విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా అధికారులకే అండ.. ప్రభుత్వానికి భారీ నష్టం

### చనుపల్లిలో ఇసుక దందా యథేచ్ఛగా

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని చనుపల్లి గ్రామంలో ఇసుక అక్రమ రవాణా పెరిగిపోతోంది. పాలేరు వాగు సమీపంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపులు కొనసాగుతున్నాయి. వాగు నుంచి భారీగా ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కాసుల కోసమే.. కక్కుర్తితో దోపిడి

**కాసుల కోసం అక్రమ ఇసుక దందా రోజురోజుకు పెరుగుతోంది.**
**ఈ దందా వల్ల స్థానిక సంస్థలకు, ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతోంది.**
**వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా**

### ఇది స్టోరీ కాదు.. ప్రజల ఆవేదన

**పట్టపగలే ట్రాక్టర్లు రోడ్లపై అతివేగంగా తిరుగుతున్నాయి.**
**ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.**
**ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు.**
**అక్రమ రవాణాకు అధికారుల సహకారం ఉందనే చర్చ సాగుతోంది.**
**ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏది..?**

### ఇసుక దందాకు రెవెన్యూ అధికారులే అండ.?

పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తున్నా అధికారులు అడ్డుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. "ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి" అంటూ దందా నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏది?

ఇందిరమ్మ ఇళ్లు

ఒకవైపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఇసుక కోసం అవస్థలు పడుతుంటే, బడాబాబులకు మాత్రం ఇసుక అవలీలగా అందుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సరిపడా ఇసుక అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టి నిజమైన అవసరాల కోసం ఇసుకను అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అనంతగిరి మండల పరిధిలోని చనుపల్లి గ్రామంలో ఇసుక వనరుల దోపిడి దందాను అడ్డుకునే నాథుడే లేకుండా పోయారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా రోజురోజుకు విచ్చలవిడిగా పెరిగిపోతోంది. పాలేరు వాగు సమీపంలో అక్రమ దందాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాలకు చనుపల్లి నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లు,ద్వారా జోరుగా అక్రమ ఇసుక రవాణా దందా కొనసాగుతోంది....కాసులకు కక్కుర్తి పడి ఈ అక్రమ దందా రోజు రోజుకు పెరిగిపోతున్నట్టు సమాచారం. ఈ దందాతో స్థానిక సంస్థలకు, ప్రభుత్వానికి భారీగానే నష్టం వాటిల్లుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టపగలే ఇసుక వనరులను దోచుకుంటున్నారు. అధికారులు మాత్రం చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా ఇసుక దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంలా కొనసాగుతోంది. ఎక్కువగా రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పొలాల్లో డంపింగ్ చేసి.. ట్రాక్టర్ ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది...

### ఇసుక దందాకు రెవెన్యూ అధికారులే అండ.?

కొంత మంది రెవెన్యూ అధికారుల అండతో ఇసుక రవాణా జోరుగా సాగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మిషన్ లేకున్నా ఇసుకను తరలిస్తున్నారని ప్రశ్నిస్తే.. అధికారుల అండదండలు ఉన్నాయని, ఇష్టం ఉన్నచోట చెప్పుకోండి అంటూ ఎదురు దాడికి దిగుతున్న సందర్భాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే అతివేగంతో ట్రాక్టర్లు రోడ్లపై ప్రయాణిస్తుంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇసుక దందాకు అధికారులు సహకరిస్తున్నారని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసిన అధికారులు, చూసీచూడట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇసుక రవాణాకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై విచారణ చేసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు...

### ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఏది

ఓ వైపు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక దొరకక సామాన్యులు అవస్థలు పడుతుంటే బడాబాబులకు మాత్రం ఇసుక అవలీలగా దొరుకుతుంది. ఇందిరమ్మ ఇండ్లకు సకలంలో ఇసుక అందించాలని లబ్దిదారులు కోరుతున్నారు. అయితే వాగులో నీటి ప్రవాహం తగ్గడం వల్ల ఇసుక సరఫరా యథేచ్ఛగా అనంతగిరి మండలంలో చనుపల్లిలో ఇసుక అక్రమ సరఫరా అవుతుంటే ఇందిరమ్మ లబ్దిదారులకు ఏమి సమాధానం చెబుతారనేది ప్రశ్నగానే మిగులుతుంది. దీంతో మండలంలో ఇందిర్మ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక గుదిబండగా మారింది.

**ఇసుక దందాపై ఉన్నతాధికారులు సీరియస్‌గో దృష్టి పెట్టాలి | అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి**

## కాలేశ్వరంలో 100% ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

**మహాదేవపూర్ , మే 11: (విజన్ ప్రభ )**

కాలేశ్వరం లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 15 రోజుల సమ్మర్ క్యాంప్ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సమ్మర్ క్యాంప్ మే 11, 2026 నుండి మే 25, 2026 వరకు అన్ని పీఎంఎస్ పాఠశాలల్లో నిర్వహించబడనుంది. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఇదే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలకు కూడా శ్రీకారం చుట్టారు ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. అదేవిధంగా 500కు పైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థుల( అక్షయ, నవ్యశ్రీ ,రమణి )తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విజయాలకు ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కారణమని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

"ప్రభుత్వ పాఠశాలలు నేడు నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారుతున్నాయి. పి ఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ కాలేశ్వరం విద్యార్థులు సాధించిన ఫలితాలు గ్రామానికి గర్వకారణం. సమ్మర్ క్యాంప్ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, భాషా నైపుణ్యాలు పెంపొందుతాయి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరుతున్నాను, అని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొనికల రాజేందర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధే మా లక్ష్యం. చదువుతో పాటు కళలు, క్రీడలు, సైన్స్, భాషా నైపుణ్యాల అభివృద్ధికి సమ్మర్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సంవత్సరం 100% ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రుల సహకారంతో ఇంకా మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం, అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్మెల సుధీర్, పాఠశాల ఉపాధ్యాయులు వి.విజయశ్రీ,ఎ.సువర్ణ. ఎ.జ్యోతి.టి.శిరీష., జి.శారద,జె.సమ్మయ్య,, సి ఆర్ పి లు సతీష్, బానయ్య,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు, పాల్గొన్నారు.

## జనగణన సర్వేను ప్రారంభించిన : సర్పంచ్ దున్నా శ్రీనివాస్

**సూర్యాపేట జిల్లా మే 11 ( విజన్ ప్రభ )**

: నడిగూడెం:మండల కేంద్రంలో :కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 2027 జనాభా లెక్కల్లో తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 11 నుండి జూన్ 9 వ వరకు మొదటి విడతలో చేపడుతున్న ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని తహసిల్దార్ సోమపంగ సూరయ్య కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 51 మంది ఏ ఎన్యూమారేటర్లు,9 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో ఎన్యూమా రేటర్లు చేపట్టిన జనగణన సర్వేను గ్రామ సర్పంచి దున్నా శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆరుగురు ఎన్యూమారే టర్లు, ఒక సూపర్వైజర్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి య లక ఉమారాణి,ఉపసర్పంచ్ ఎలుగూరి నాగరాజు,వార్డ్ వార్డు సభ్యులు దున్న లింగయ్య, కాసాని మాధవి గోపీనాథ్, షేక్ నాజీయా రియాజ్, జిపిఓ కోటయ్య, సూపర్వైజర్ ఉపేందర్ , ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వీర అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి

**సూర్యాపేట జిల్లా మే 11 ( విజన్ ప్రభ )**

అనంతగిరి మండల పరిధిలోని పాలవరం గ్రామంలో శ్రీ వీర అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపనతో పాటు గజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు.

గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయిన ఈ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు.ఈ కార్యక్రమానికి కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మరియు గజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాల్లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొనడం విశేష ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, పాలవరం గ్రామ ప్రజలందరూ శ్రీ వీర అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## నూతన తహసీల్దార్‌ను పద్మశాలి సంఘం సన్మానం

**సూర్యాపేట జిల్లా మే11( విజన్ ప్రభ )**

కోదాడ: మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సంతోష్ కిరణ్ కు పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు గొర్రె రాజేష్ నేతృత్వంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో సత్కరించారు.?ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా చేనేత వర్గాల వారికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యాలయ పనుల నిమిత్తం ఎవరు వచ్చినా పారదర్శకంగా సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు నక్కా చంద్రం, పిండిప్రోలు శ్రీనివాస్, పంతంగి నరేష్, నక్క గోపి, కొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలుర పాఠశాల ఎస్సెస్సీ టాపర్స్ కు సన్మానం

**మహాదేవపూర్ మే 11 (విజన్ ప్రభ)**

మహాదేవపూర్ : బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 500 లకు పైగా మార్కులు సాధించిన ఏ.రాజశేఖర్ 546 (మండల ద్వితీయ స్థానం)ఏ.కౌశిక్ 539, ఎం.శివనవదీప్ 534,పి.అర్షిత 526,జె.శ్రావణి 520, ఏ.అశ్విత 517,ఎస్.నందిని, 515ఏ.శృతి 503 ల తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ శ్రీమతి హసీనా బానో గారు మరియు ఉప సర్పంచ్ శ్రీమతి శ్రీజ గార్ల చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానం చేసి విద్యార్థులను అభినందించారు.విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుల కృషిని మెచ్చుకున్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ అనిల్ కుమార్ అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సమావేశంలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు సర్పంచ్ నగదు బహుమతి ప్రకటించారు.పట్టుదలతో చదివితే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజయ్య,దేవేందర్ రెడ్డి, లచ్చయ్య, అనిల్ కుమార్ శ్రీమతి కవిత మరియు కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# వారణాసికి బయలుదేరుదాం

## హీరోయిన్ ప్రియాంక ఆసక్తిక పోస్ట్

ఎస్ఎస్ రాజమౌళి –మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు ప్లాన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. దీంతో 'కల్కి 2'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లే జరిగితే 2027 డిసెంబర్‌లో 'కల్కి 2' ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

## నటి త్రిష ఆసక్తికర పోస్ట్

ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెహ్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాషన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

# నేను చేసే సినిమాల్లో కథే హీరో: సమంత

ఇకపై ఎలాంటి చిత్రాలలో నటించాలనేది.. కథతో పాటు అందులోని పాత్రే నిర్ణయిస్తుందంటోంది కథానాయిక సమంత. ఇటీవల జరిగిన ఓ మ్యాగజైన్ కవర్ షూటింగ్ సమయంలో ఎదురైన ప్రశ్నలకుగానూ సమంత తన పాత్రల ఎంపిక గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "నేను చేసే సినిమాల్లో కథే హీరో అవుతుంది. కథ.. నిర్మాత, నటీనటుల కంటే గొప్పది. సమాజంలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం ఉండాలని కోరుకుంటున్నాను. సినిమాలు చూస్తున్న మహిళలు వాటిలోని పాత్రలతో మమేకమవ్వగలగాలి. తమను కూడా గుర్తించారని వారు భావించేలా అవి ఉండాలి. ఇకపై అలాంటి చిత్రాల్లోనే భాగం కావాలనుకుంటున్నాను.కామెడీ, యాక్షన్ తరహాలో నేను వేరు వేరు చిత్రాలలో చేశాను కానీ, రెండు ఒకేసారి చేయలేదు. సాధారణంగా ఒక సినిమాలో నాయిక ప్రధాన పాత్రలో నటించినప్పుడు దానికి ఎప్పుడూ కొంత సామాజిక కోణం జోడించి ఉంటుంది. అది సినిమాను గంభీరంగా చేస్తుంది. మేము సాధారణ భావనలకు దూరంగా ఉండి 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని అత్యంత వినోదాత్మకంగా, కుటుంబం మొత్తం ఆస్వాదించేలా తీర్చిదిద్దాం" అని అంది. సమంత 'మా ఇంటి బంగారం' సినిమా జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# విశ్వంభర మూవీ పై భారీ అంచనాలు

## రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా మొత్తం విజువల్ ఫాంటసీ ప్రపంచం నేపథ్యంలో తెరకెక్కుతుండటంతో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని సమాచారం. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి స్వయంగా వీఎఫ్ఎక్స్ పనులను పర్యవేక్షిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతి ఫ్రేమ్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం 'హను-మాన్' ఫేమ్ గౌర హరిని కూడా రంగంలోకి దింపినట్లు సమాచారం. మొత్తానికి 'విశ్వంభర' సాధారణ ఫాంటసీ చిత్రం కాకుండా, తెలుగు ప్రేక్షకులకు భారీ విజువల్ విందుగా నిలవబోతుందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# విజయ్ పై ప్రియాంక వ్యాఖ్యలు వైరల్

గ్లోబల్ స్టార్‌గా ఓ వెలుగు వెలుగుతున్న ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం ప్రస్తుత తమల సిఎం, హీరో విజయ్‌తో మొదలైంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఆయన గురించి గతంలో ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. 2002లో విడుదలైన తమిజన్ సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో విజయ్ హీరోగా నటించగా, ప్రియాంక హీరోయిన్‌గా కనిపించారు. అప్పట్లో కొత్తగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియాంకకు తమిళ భాష కూడా తెలియదట. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నాకు అప్పట్లో తమిళం అస్సలు రాదు. డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టి చెప్పేదాన్ని. సినిమాల షూటింగ్ ఎలా జరుగుతుంది? సెట్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై కూడా పెద్దగా అవగాహన లేదు. థియేటర్‌లో సినిమాలు చూడడమే నాకు తెలిసిన అనుభవం అంటూ గుర్తుచేసుకున్నారు. అయితే 'తమిళన్' షూటింగ్ సమయంలో విజయ్‌కు ఉన్న అభిమాన గణాన్ని చూసి తాను పూర్తిగా ఆశ్చర్యపోయానని ప్రియాంక తెలిపారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వందలాది అభిమానులు వచ్చేవారని, సెట్స్‌లోకి రావడానికి కూడా పోటీ పడేవారని చెప్పారు. విజయ్ డ్యాన్స్ చేస్తున్నా, డైలాగులు చెబుతున్నా అభిమానులు ఆయననే చూస్తూ ఉండేవారు. ఆ క్రేజ్ చూసి నేను షాక్ అయ్యాను. ప్రజలు విజయ్‌ను దేవుడిలా ఆరాధిస్తున్నారనే భావన నాకు కలిగింది అంటూ ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా కూడా గతంలో విజయ్ వ్యక్తిత్వంపై ప్రశంసలు కురిపించారు. షూటింగ్ సమయంలో విజయ్ ప్రియాంకను ఎంతో గౌరవంగా చూసుకునేవారని, కొత్త హీరోయిన్ అయినప్పటికీ ఎంతో సహకరించారని తెలిపారు. మొదట్లో విజయ్‌తో సమానంగా డ్యాన్స్ చేయడం ప్రియాంకకు కాస్త కష్టంగా అనిపించిందని, కానీ ఆమె కఠిన సాధనతో తన ప్రతిభను నిరూపించుకుందని చెప్పారు. అలాగే 'తమిళన్' సినిమా అనుభవమే ప్రియాంకను నటనను పూర్తి స్థాయి కెరీర్‌గా ఎంచుకునేలా ప్రేరేపించిందని వెల్లడించారు. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'తమిళన్' సినిమా విడుదలైన తర్వాత మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ప్రియాంక చోప్రాకే కాకుండా దర్శకుడు మజీత్‌కు కూడా తొలి చిత్రం కావడం విశేషం.